క్లుప్తంగా

మెరుగైన వైద్యం అందించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి

సిద్దిపేటకమాన్: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి సిబ్బందికి సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని లింగారెడ్డిపల్లిలో బస్తీ దవాఖానను సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ సోమవారం సందర్శించారు. దవాఖానకు వచ్చిన ప్రజలతో అక్కడ అందుతున్న వైద్య సేవలు, సదుపాయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు వైద్యం అందాలన్న ఉద్దేశంతో బస్తీ దవాఖానను అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు.

తరగతి గదుల్లోనే విద్యార్థుల భవిష్యత్



మాట్లాడుతున్న హెచ్ఎం

చిన్నకోడూరు(సిద్దిపేట): తరగతి గదుల్లోనే విద్యార్థుల భవిష్యత్ ఉందని, విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు రావాలని హెచ్ఎం అబ్దుల్ షరీఫ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని రామంచ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యాభివృద్ధికి విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలన్నారు. విద్యార్థులు శ్రద్ధగా చదివి భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాములు, రవీందర్‌రెడ్డి, సురేశ్ కుమార్, సునీత, వాణితో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠోత్సవాలు



పూజలు చేస్తున్న గ్రామస్తులు

నంగునూరు(సిద్దిపేట): మండలంలోని తిమ్మాయిపల్లి గ్రామంలో రెండు రోజులుగా జరుగుతున్న బొడ్రాయి ఉత్సవాల్లో భాగంగా సోమవారం నాభిశిలకు మహిళలు జలాభిషేకం చేశారు. ఉదయం గణపతి పూజ, అఖండ దీపస్థాపన అంకురార్పణ, యాగశాల ప్రవేశం, మూలమంత్ర హవనం, అగ్ని ప్రతిష్ఠ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్, వార్డు సభ్యులు, బొడ్రాయి ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికి తీయడానికే చర్యలు



సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులు

హుస్నాబాద్‌రూరల్: విద్యార్థుల్లో దాగిన ప్రతిభను వెలికితీయడానికి సైన్స్ ఫెయిర్ చక్కటి వేదికని ఇన్‌చార్జి ఎంఈఓ దేశిరెడ్డి అన్నారు. సోమవారం కూచనపెల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌ను ఆయన సందర్శించి విద్యార్థులు తయారు చేసిన ప్రయోగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రాథమిక దశలోనే విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన కల్పిస్తే ఉన్నత చదువులకు వెళ్లిన తర్వాత వారు రకరకాల ప్రయోగాలు చేస్తారన్నారు. సైన్ ఫెయిర్‌లో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శంకర్‌నాయక్, సీఆర్పీ పోలు స్వామి, ఎంపీటీసీ జయలక్ష్మి పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం



డ్రైవర్లు, కండక్టర్లను సన్మానిస్తున్న దృశ్యం

గజ్వేల్‌రూరల్: ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని రీజనల్ మేనేజర్ సుదర్శన్ అన్నారు. సోమవారం గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లోగల జీపీపీ(గజ్వేల్-ప్రజ్ఞాపూర్) ఆర్టీసీ డిపోను సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేస్తూ ఉత్తమ విధులు నిర్వహించిన ఇద్దరు డ్రైవర్లు, ముగ్గురు కండక్టర్లకు నగదు బహుమతిని అందించి సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జీపీపీ ఆర్టీసీ డిపో మేనేజర్ సురేఖ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



తోటపల్లిలో ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రసమయి

బెజ్జంకి(సిద్దిపేట): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు ఆయన హాజరయ్యారు. మండలంలోని తోటపల్లిలో 1.56 కోట్లతో నిర్మించనున్న ఆస్పత్రి, 5లక్షలతో నిర్మించనున్న కమాన్ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. వీరాపూర్‌లో అంబేడ్కర్ భవనం, సీసీరోడ్ల పనులకు శంకుస్థాపన, మహిళా భవనం, విశ్వబ్రాహ్మణ సంఘ భవనం, సీసీరోడ్లు, వైకుంఠధామాలను ఆయన ప్రారంభించారు. లక్ష్మీపూర్‌లో సీసీరోడ్లు, రెడ్డి సంఘ భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. బేగంపేటలో షాపింగ్ కాంప్లెక్స్, సీసీరోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ నిరంతం కృషి చేస్తున్నారన్నారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. సీఎం కేసీఆర్‌పై ప్రతిపక్షాల విమర్శలు నమ్మొద్దని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ లింగాల నిర్మల, జెడ్పీటీసీ కనగండ్ల కవిత, తహసీల్దార్ విజయప్రకాశ్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు సైన్స్‌పై పట్టు సాధించాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సిబ్బంది

తొగుట(దుబ్బాక): మండలంలోని వెంకట్రావుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్రియేటివ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైన్స్ టాలెంట్ టెస్టులు సోమవారం నిర్వహించారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా 9వ తరగతి విద్యార్థులకు సైన్స్ టాలెంట్ టెస్టులు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు లింగ శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులు సైన్స్‌పై పట్టు సాధించాలని విద్యార్థులకు సూచించారు. సర్ సీవీ రామన్ రామన్ ఎఫెక్ట్‌ను కనుగొని ప్రపంచానికి భారతీయుల సత్తా చాటాడన్నారు. భారత ప్రభుత్వం ఫిబ్రవరి 28 తేదీని సైన్స్ దినంగా ప్రకటించిందన్నారు. టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మధు, క్రియేటివ్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న షీటీమ్ పోలీసులు

హుస్నాబాద్: మహిళలు, విద్యార్థినుల భద్రత, రక్షణ కోసమే షీటీమ్స్ పని చేస్తున్నాయని ఏఎస్సై మల్లేశం తెలిపారు. హుస్నాబాద్ పట్టణంలోని టీఎస్ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో సోమవారం షీటీమ్ పోలీస్‌లు బాలికలు, మహిళల చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్సై మల్లేశం మాట్లాడుతూ.. ఎవరైనా ఆకతాయిలు వేధింపులకు గురి చేసినా మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురి చేసినా షీటీమ్స్ పోలీస్‌లకు సమాచారం ఇవ్వాలని కోరారు. విద్యార్థి దశలోనే ఉన్నతంగా చదువుకొని మంచి ఉద్యోగాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మార్తాన్, మహిళా కానిస్టేబుల్ రజిత, కానిస్టేబుల్ దుద్యా నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రీతి మృతికి కారకులైన నిందితులను ఉరితీయాలి



హుస్నాబాద్‌లో సైఫ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న గిరిజన సంఘాల నాయకులు

హుస్నాబాద్: పీజీ వైద్య విద్యార్థిని ధరావత్ ప్రీతి మృతికి కారకుడైన మహమ్మద్ సైఫ్‌ను ఉరితీయాలని డిమాండ్ చేస్తూ సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో గిరిజన సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. నిందితుడి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే ప్రీతి కుటుంబానికి రూ.5కోట్ల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాజూనాయక్, జిల్లా అధ్యక్షుడు మాలోతు సత్యంనాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతినాయక్, లంబాడీల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కృష్ణనాయక్, నాయకులు ఉన్నారు.

సిద్దిపేటఎడ్యుకేషన్: మెడికల్ విద్యార్థుల ఆత్మహత్యలకు పూర్తి బాధ్యత ప్రభుత్వమే వహించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని లేదంటే ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రంజిత్‌రెడ్డి, సహాయ కార్యదర్శులు నవీన్, చందు, కనకరాజ్, భరత్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు రక్షణ కల్పించండి

గజ్వేల్‌రూరల్: పాఠశాలలు, కళాశాలల్లో విద్యనభ్యసించేందుకు వచ్చే విద్యార్థినులకు రక్షణ కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. సోమవారం గజ్వేల్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. ర్యాగింగ్ నిరోధక కమిటీలను ఏర్పాటు చేయడంతో పాటు షీటీమ్‌ను ఏర్పాటు చేసి విద్యార్థినులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

ప్రభుత్వమే బాధ్యత వహించాలి

చిన్నకోడూరు(సిద్దిపేట): మెడికల్ విద్యార్థుల ఆత్మహత్యలకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. నిందితులను కఠినంగా శిక్షించాలని, ప్రీతి కుటుంబానికి రూ.50లక్షలు అందజేయాలని డిమాండ్ చేశారు.

అక్కన్నపేట(హుస్నాబాద్): వైద్య విద్యార్థి ప్రీతి మృతికి కారకుడైన సైఫ్‌ను ఉరితీయాలని ఎంపీపీ మాలోతు లక్ష్మి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

గజ్వేల్: ఉన్నత విద్యారంగంలో అట్టడుగు వర్గాల ప్రవేశాన్ని జీర్ణించుకోలేకపోవడంతోనే కులం రంగు పులిమి వేధిస్తున్నారని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు రాములు మాదిగ ఆరోపించారు. సోమవారం గజ్వేల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు.

కల్యాణలక్ష్మి పేదింటి ఆడబిడ్డలకు వరం



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

వర్గల్(గజ్వేల్): కల్యాణలక్ష్మి పేదింటి ఆడబిడ్డలకు వరంలా మారిందని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం వర్గల్ ఎంపీపీ కార్యాలయ సమావేశ మందిరంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను వారు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బాలూయాదవ్, ఎంపీపీ లతారమేశ్‌గౌడ్, వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్, తహసీల్దార్ సతీశ్, ఎంపీడీఓ స్వర్ణకుమారి పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో యాజమాన్యాల నిర్లక్ష్య వైఖరిపై తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ ఐక్య కార్యాచరణ ఆధ్వర్యంలో సోమవారం విద్యుత్ భవన్ ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ వీరభద్రయ్య మాట్లాడుతూ.. ఉద్యోగులకు పీఆర్సీతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ గంగాధర్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, హుస్సేన్, పాండరి, బాలకిషన్, చంద్రారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, స్వామిదాస్, లక్ష్మారెడ్డి, రామకిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా వెంకటేశ్వర్లు



కరీంనగర్ రీజనల్ మేనేజర్‌కు మొక్క అందజేస్తున్న వెంకటేశ్వర్లు

హుస్నాబాద్: హుస్నాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా డీ.సీహెచ్.వెంకటేశ్వర్లు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కొన్ని నెలలుగా హుజూరాబాద్ డిపో మేనేజర్ అర్పిత ఇన్‌చార్జిగా కొనసాగారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం కరీంనగర్ రీజినల్ మేనేజర్ కుష్రోష ఖాన్, డిప్యూటీ ఆర్ఎం చంద్రారావు, డిప్యూటీ ఆర్ఎం(ఎం) ఎస్.భీమ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

సంక్షిప్త వార్తలు

◆ **టాలెంట్ టెస్ట్‌ను జయప్రదం చేయాలి**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో మార్చి 1న 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించనున్న టాలెంట్ టెస్ట్‌ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి నవీన్ కోరారు. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని సోమవారం జిల్లా కేంద్రంలోని పవిత్ర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ బాధ్యులు రోహిత్, కనకరాజు, రాఘవ, భరత్ తదితరులు పాల్గొన్నారు.

◆ **జోడోయాత్రను జయప్రదం చేయాలి**

కోహెడ(హుస్నాబాద్): టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నిర్వహిస్తున్న హాథ్ సే హాథ్ జోడో యాత్రను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని లక్ష్మి గార్డెన్‌లో మండల కాంగ్రెస్ కార్యకర్తలతో జోడోయాత్ర సన్నాహక సమావేశం నిర్వహించారు. జోడోయాత్ర బహిరంగా సభను అంబేడ్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేశామన్నారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. కార్యక్రమంలో బస్వారాజు శంకర్, మంద ధర్మయ్య, నారాయణగౌడ్, భానుప్రకాశ్, మల్లారెడ్డి, గాలిరెడ్డి, తిరుపతిరెడ్డి, రాగుల శ్రీనివాస్, శంకర్, రఫీ పాల్గొన్నారు.

◆ **కాల్వల నిర్మాణం వెంటనే పూర్తి చేయాలి**

చేర్యాల(సిద్దిపేట): పెండింగ్‌లో ఉన్న కాల్వ నిర్మాణ పనులు పూర్తిచేసి వెంటనే రైతులకు సాగు నీరు అందించాలని సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఈరి భూమయ్య డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. రైతుల పంటలు ఎండిపోయి ఇబ్బంది పడుతున్నారని, రైతుల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేసి సాగు నీరు అందించాలన్నారు. లేని పక్షంలో రైతులను ఏకం చేసి బీకేఎంయూ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

◆ **ప్రతీ ఇంట్లో వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలి**

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని ప్రతీ ఇంట్లో వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మించుకునేలా చూడాలని బెజ్జంకి ఎంపీపీ లింగాల నిర్మల సూచించారు. బెజ్జంకి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం స్వచ్ఛ భారత్ మిషన్ రెండో దశ నిర్వహణ కోసం ప్రజాప్రతినిధులు, అధికారులకు శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు, క్షేత్రస్థాయి అధికారులు, మహిళా సంఘాల సభ్యులను భాగస్వాములను చేసినప్పుడే సంపూర్ణ స్వచ్ఛత సాధిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కచ్చు రాజయ్య, స్వచ్ఛ భారత్ మిషన్ కోఆర్డినేటర్లు చెన్నారెడ్డి, సత్యనారాయణ, ఎంపీఓ విష్ణు, పాల్గొన్నారు.

◆ **సబ్బండ వర్గాలకు బీఆర్ఎస్ అండ**

దుబ్బాక: తెలంగాణలోని సబ్బండ వర్గాలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు, దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి సతీమణి సోలిపేట సుజాత అన్నారు. సోమవారం దౌల్తాబాద్ మండల కేంద్రంలోని మల్లన్న కల్యాణ మహోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా గొల్ల కులస్తులను కలిసి వారితో ఆప్యాయంగా మాట్లాడారు. అనంతరం వారికి శాలువా కప్పి ప్రత్యేకంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కుల వృత్తులకు రాష్ట్ర ప్రభుత్వం జీవం పోసి వారి అభివృద్ధికి పాటు పడుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ యాదగిరి, జిల్లా కోఆప్షన్ సభ్యుడు రహీమొద్దీన్, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, తదితరులున్నారు.

◆ **ప్రమాద బీమాతో భరోసా**

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని ఇబ్రహీంనగర్, మేడిపల్లి, సికింద్లాపూర్, కస్తూరిపల్లి గ్రామాల్లో గీత కార్మికులకు సోమవారం ఫార్మర్స్ ఫస్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.5లక్షల ప్రమాద బీమా బాండ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ.. 500 మంది గీత కార్మికులకు ప్రమాద బీమా బాండ్‌లను పంపిణీ చేసినట్లు చెప్పారు.

◆ **కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి**

గజ్వేల్‌రూరల్: రైతులు పండించిన శనగలు, పొద్దు తిరుగుడు పంటను ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో విక్రయించి మద్దతు ధర పొందాలని గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, ప్యాక్స్ చైర్మన్ జేజేల వెంకటేశంగౌడ్‌లు అన్నారు. సోమవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. గజ్వేల్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం శనగలు, పొద్దు తిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తామన్నారు. రైతులు 14శాతంలోపు తేమ ఉండేలా శనగలను తీసుకొచ్చి క్వింటాల్‌కు రూ.5335లు, పొద్దు తిరుగుడు 9శాతంలోపు తేమ ఉండేలా మార్కెట్‌కు తీసుకొచ్చి మద్దతు ధర పొందాలన్నారు.

ప్రతీ కుటుంబానికి రెండు చెత్తబుట్టలు

- మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత
- సమావేశంలో పలు అంశాలపై సభ్యుల ఆమోదం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

హుస్నాబాద్: మున్సిపల్ సమావేశ మందిరంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అధ్యక్షతన సోమవారం పాలకమండలి సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు అంశాలపై ఆమోదం తెలుపుతూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సమావేశంలో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ప్రతీ కుటుంబానికి రెండు చెత్త బుట్టల పంపిణీ చేసేందుకు రూ.15లక్షలు, పట్టణంలోని ఎల్లమ్మ చెరువు వైకుంఠధామం వద్ద అనాథ శవాల దహన సంస్కారాల కోసం ముక్తిధామం గది నిర్మాణానికి అదనంగా రూ.10లక్షలు కేటాయించాలని తీర్మానం చేశారు. అలాగే పట్టణంలోని మల్లెచెట్టు చౌరస్తాలో చేపట్టిన మున్సిపల్ కాంప్లెక్స్‌లో లిఫ్ట్ ఏర్పాటుకు రూ.16లక్షలు, గ్రామ పంచాయతీ కాలంలో కిరాయి పద్ధతిపై షట్టర్లను పొంది దాదాపు 20 సంవత్సరాలు దాటినందున తిరిగి వేలం వేసేందుకు తీర్మానం చేశారు. 2022-2023 ఆర్థిక సంవత్సరానికి వాటర్ ట్యాంకర్ల మరమ్మతులు, స్టీల్ ట్రాక్టర్ల బాడీ వెల్డింగ్ కోసం రూ.99వేలు, పట్టణంలోని మూడు చోట్లలో ఉన్న పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణ బాధ్యతల నెలవారి అద్దె ప్రాతిపదికన ఎస్‌హెచ్‌జీ వారికి ఇచ్చేందుకు తీర్మానించారు. పట్టణంలో మంచినీటి సరఫరా, గేట్‌వాల్వ్‌లు, ఛాంబర్లు ఏర్పాటు చేసేందుకు రూ.5లక్షలు, ఆరెపల్లెలో వైకుంఠధామం నిర్మించేందుకు రూ.10లక్షలు, మురికినీటితో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా మురికి కాల్వల్లో ఇనుప చువ్వలు, జాలీలు వేసేందుకు రూ.2లక్షలు కేటాయించాలని పాలకవర్గ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేస్తూ ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్య, వైస్ చైర్‌పర్సన్ అనిత, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు

దుబ్బాకరూరల్: సీఎం కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరిస్తున్నారని, హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. భూంపల్లి మండలంలోని చిన్ననిజాంపేట గ్రామంలో సోమవారం బీజేపీ స్ట్రీట్ కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ.. రాష్ట్రంలో కిరాణా షాపుల్లాగా మద్యం దుకాణాలు ఎక్కడ పడితే అక్కడ వెలిశాయన్నారు. ప్రభుత్వం దగ్గర డబ్బులు లేకనే మద్యం దుకాణాలను ప్రోత్సహిస్తుందన్నారు. మద్యానికి అలవాటు పడి కొంతమంది తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ ఇంటికో ఉద్యోగం ఇప్పిస్తానని ఏ ఒక్కరికి ఉద్యోగం ఇవ్వలేదన్నారు. ఆయూష్మాన్ భారత్ ద్వారా రూ.5లక్షల వరకు ఉచితంగా వైద్యం చేయించుకో వచ్చన్నారు. పేదలకు ప్రతీ ఒక్కరికి ఐదు కిలలో రేషన్ బియ్యం ఇచ్చిన ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కృష్ణ, ఎస్ఎన్ చారి, శంకర్, యాదగిరి, సుదర్శన్, నవీన్, స్వామిరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రంలో అవినీతి పాలన

బెజ్జంకి(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించి అవినీతి పాలన కొనసాగిస్తోందని బీజేపీ మానకొండూర్ ఇన్‌చార్జి నాగరాజు ఆరోపించారు. మండలంలోని రేగులపల్లెలో సోమవారం నిర్వహించిన బీజేపీ కార్నర్ మీటింగ్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అశోక్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, శ్రీనివాస్, రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరిస్తా

మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి



చిన్న ఆరెపల్లి(ఎస్‌బీ)లో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

గజ్వేల్‌రూరల్: గ్రామంలో మౌలిక వసతులు, సౌకర్యాలను కల్పించేందుకు సిద్ధంగా ఉన్నానని, గ్రామాభివృద్ధిలో ప్రజలంతా భాగస్వాములు కావాలని మెదక్ ఎంపీ, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గజ్వేల్ మండలం చిన్న ఆరెపల్లి(ఎస్‌బీ)లో సోమవారం ఆయన పర్యటించారు. ముందుగా గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలో బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలను ఎంపీకి వివరించారు. కార్యక్రమంలో గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, ఎంపీపీ దాసరి అమరావతి, జెడ్పీటీసీ మల్లేశం, గ్రామ సర్పంచ్ షమీన్‌బేగం, ఎంపీటీసీ నక్కిర్త గంగాధర్, గజ్వేల్ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెండ మధు, దౌల్తాబాద్ మండల శాఖ అధ్యక్షుడు, జెడ్పీటీసీ శ్రీనివాస్, గ్రామ అధ్యక్షుడు మల్లేశం, ఉపసర్పంచ్ దేవేందర్, బయ్యారం సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

దుబ్బాక: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని ఎంపీ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం రాయపోల్ మండల కేంద్రంలోని ఆరెపల్లి గ్రామంలో బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించి ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. అనంతరం పలు కులాల కమ్యూనిటీ హాళ్లకు భూమిపూజ చేశారు. అలాగే కొత్తపల్లి గ్రామంలో సీసీరోడ్లకు శంకుస్థాపన చేసి, పాఠశాల విద్యార్థులకు, యువకులకు క్రీడా సామగ్రిని అందించారు. అనాజీపూర్ గ్రామంలోని రోడ్డు పనులను పరిశీలించి పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పెద్ద ఆరెపల్లిలో 12 మంది మహిళలకు గ్రామ సర్పంచ్ రూ. 60వేలను ఎంపీ చేతుల మీదుగా సాయం అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ అనిత శ్రీనివాస్, జెడ్పీటీసీ యాదగిరి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరశర్మ, ఏఎంసీ చైర్‌పర్సన్ ఇప్ప లక్ష్మి ఉన్నారు.

మల్లన్న మహోత్సవంలో ఎంపీ

దౌల్తాబాద్ మండల కేంద్రంలోని స్వయంభూ శంభులింగేశ్వరాలయంలో జరుగుతున్న మల్లన్న జాతరలో ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఎర్ర చెరువును కాపాడాలి

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని అయినాపూర్ గ్రామ శివారులో గల ఎర్ర చెరువును రియాల్టర్ల నుంచి కాపాడాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కమిటీ సభ్యుడు, కొమురవెల్లి మల్లన్న ఆలయ చైర్మన్ గీస భిక్షపతి అన్నారు. సోమవారం ఎర్ర చెరువును కాపాడాలని మండల ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి కార్యాలయంలో పలు డిమాండ్లతో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ.. ఎర్ర చెరువుపై 287 మత్స్య కార్మిక సంఘాలు ఆధారపడ్డాయని, 500 ఎకరాల పొలాలకు నీరు పారుతుందని తెలిపారు. ఈ చెరువులో 104 ఎకరాలు ఎఫ్.టీ.ఎల్ పరిధిలో ఉండగా రాష్ట్ర ప్రభుత్వం మిషన్ కాకతీయ ద్వారా రూ.30లక్షలతో పూడిక తీసి కట్టకు మరమ్మతులు చేస్తే కొందరు వక్తులు చెరువును పూడ్చి ఫామ్‌ల్యాండ్ పేరుతో విక్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు గొల్లపల్లి కిష్టయ్య, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా డైరెక్టర్ తేలు ఇస్తారి, ఐనాపూర్ మత్స్య కార్మికులు వెంకట్, చీకోటి నర్సింహులు, సత్తయ్య, చంద్రయ్య, నర్సింహులు, యాదగిరి, రమేశ్, సాయిలు, రాజు, శంకరయ్య పాల్గొన్నారు.

అంధత్వ నివారణే లక్ష్యం



సిద్దిపేటజోన్: శిబిరాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల



జగదేవ్‌పూర్‌లో కంటి వెలుగును ప్రారంభిస్తున్న ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): కంటి వెలుగును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం జగదేవ్‌పూర్‌లో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలేశంగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ కవిత, కో-ఆప్షన్ సభ్యుడు ఏక్బాల్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ఉపసర్పంచ్ మల్లేశం, ఇటిక్యాల సర్పంచ్ చంద్రశేఖర్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట

గజ్వేల్‌రూరల్: ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వసతులు, సౌకర్యాలను కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. మండల పరిధిలోని ర్యాగట్లపల్లి గ్రామంలో సోమవారం గ్రామ సర్పంచ్ శివలక్ష్మిరాంపాండుతో కలిసి కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, ఎంపీపీ దాసరి అమరావతి, జెడ్పీటీసీ మల్లేశం, ఎంపీటీసీ దమ్మని రాజేశ్వరి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మధు, ఆత్మ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు రమేశ్‌గౌడ్, అహ్మద్, అశోక్, శివకుమార్ పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

సిద్దిపేటజోన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కంటి వెలుగును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు అన్నారు. సోమవారం పట్టణంలోని కాళ్లకుంట కాలనీ 11వ వార్డులో కంటి వెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా వసతులపై ఆరా తీశారు. ఆమె వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు, కౌన్సిలర్ భాగ్యలక్ష్మి, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.